# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటనను ముగించుకొని విజయవాడ చేరుకున్నారు.**
2. **తెలంగాణలో కొత్తగా మరో విద్యుత్ పంపిణీ సంస్థ–డిస్కం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
3. **భారత్–అమెరికాలు చేపట్టిన నిసార్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ - ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు.**
4. **అన్నదాత సుఖీభవ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లాల్లో ప్రారంభిస్తారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.**
5. **తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకే వేతనం అమలు చేయాలని ఆ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటనను ముగించుకొని గత రాత్రి విజయవాడ చేరుకున్నారు. హైదరాబాద్ మీదుగా ప్రత్యేక విమానంలో రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీష్ కుమారుగుప్తా, ఇతర అధికారులు స్వాగతం పలికారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలను ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి నాలుగురోజుల పాటు సింగపూర్‌లో పర్యటించారు.

--------------------------

తెలంగాణలో కొత్తగా మరో విద్యుత్ పంపిణీ సంస్థ–డిస్కం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఇంధనశాఖపై ఉన్నతాధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త డిస్కం ప్రభుత్వ రాయితీపై అందించే విద్యుత్ పథకాలను నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయంతో పాటు ఇళ్లు, పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలన్నీ కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ఇందిర సౌర గిరి జలవికాసం పథకాన్ని రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ తండాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ సింగపూర్ పర్యటన కొనసాగుతుంది. అమరావతి స్మార్ట్ సిటీ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలను అధ్యయనం చేసేందుకు సింగపూర్ లోనే ఉన్నారని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా నిన్న పలు సంస్థలతో సమావేశమై అమరావతిలో సూక్ష్మ స్థాయిలో పచ్చదనం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కాగా మంత్రి నారాయణ రేపు సింగపూర్ నుంచి బయలుదేరి మలేషియాకు వెళ్లనున్నారు. అక్కడ పుత్రజయతో పాటు కౌలాలంపూర్‌లో పలు ప్రాంతాలను మంత్రి సందర్శించనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

భారత్–అమెరికాలు చేపట్టిన నిసార్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ – ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం–షార్ నుండి జీఎస్ఎల్‌వీ–ఎఫ్16 వాహక నౌక ద్వారా ఈ ఉపగ్రహాన్ని గత సాయంత్రం నింగిలోకి ప్రయోగించారు. అనంతరం ఇస్రో చైర్మన్ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, 19 నిమిషాల అనంతరం ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యలోకి చేరుకుందని తెలిపారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ద్యూయల్–బ్యాండ్ రాడార్ ఉపగ్రహమని నారాయణన్ పేర్కొంటూ,

వాయిస్ 39 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ కోరారు. ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 9 వేల 500 కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవం కోసం ఆగస్టు 2న రాష్ట్రానికి నితిన్ గడ్కరీ రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్ల గురించి ఆయనకు మంత్రి సత్యకుమార్ వివరించారు. అనంతరం రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రి చర్చించారు.

---------------------------

బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణలో ఈ రోజు నుంచి ఆగస్టు 4 వరకు మొదటి విడత జనహిత పాదయాత్ర నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌లు ముఖ్యమంత్రితో నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తొలి జనహిత పాదయాత్రను రంగారెడ్డి జిల్లా పరిగిలో ఈ రోజు ప్రారంభిస్తామని చెప్పారు. ఆగస్టు 4న ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌లో సమావేశం ఉంటుందని తెలిపారు. అలాగే రిజర్వేషన్ల అంశంపై ఆగస్టు 5, 6, 7 తేదీల్లో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.

---------------------------

అన్నదాత సుఖీభవ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లాల్లో ప్రారంభిస్తారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న దర్శి నియోజకవర్గం వీరయ్యపాలెం గ్రామంలో ఏర్పాట్లను మంత్రి గత సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా బహిరంగ సభ

ఏర్పాటు, స్థల పరిశీలన వంటి వాటిపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

వాయిస్…34 సెకన్లు

---------------------------

తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒకే వేతనం అమలు చేయాలని ఆ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు మంత్రితో నిన్న సమావేశమై అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి తీసుకునేలా సాధ్య సాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. వారికి ఆరోగ్య బీమా కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంజూరు చేసిన అన్ని గృహాలను ప్రణాళికా బద్ధంగా పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 74 వేల 489 గృహాలను మంజూరు చేయగా, ఇప్పటివరకు 38 వేల 762 ఇళ్లను పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన వాటిని తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. పునాది నుండి నిర్మాణాలపై దృష్టి సారించాలని, లబ్ధిదారులకు పథకం గురించి అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, జలియన్ వాలా బాగ్ హత్యాకాండకు సూత్రధారి జనరల్ మైకేల్ డయ్యర్‌ను హతమార్చిన ఉద్ధం సింగ్ వర్ధంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. 1899 డిసెంబర్ 26వ తేదీన పంజాబ్ రాష్ట్రంలోని సునాం గ్రామంలో జన్మించిన ఆయన… దేశ భక్తికి, త్యాగానికి మరో పేరుగా నిలిచారు. స్వాతంత్ర్య సాధన కోసం ప్రముఖ విప్లవ వీరుడు భగత్ సింగ్‌తో కలిసి అనేక విప్లవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డయ్యర్‌ను హతమార్చినందుకు ఉద్దం సింగ్‌ను 1940 జూలై 31వ తేదీన బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్ నారాయణ తెలియజేశారు.

వాయిస్…20 సెకన్లు

=====================